సమర్థుడు

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

"బి. ఏ. కాగానే ఏ రివిన్యూ డిపార్టుమెంటు లోనో గుమాస్తాగా చేరవలసింది...పొరపాటున బి. యిడి. లో చేరాను. అనుభవిస్తున్నాను" అన్నాడు రాఘవయ్య ఒకసారి.

"మీరే అలా అంటే మేమెవరితో చెప్పుకోవాలి? మీరలా అంటారు గాని మీకు వచ్చిన లోటేమిటి? మీ కున్న పలుకుబడి, శక్తి సామర్థ్యాలు ఎవరికి ఉన్నయ్..."అంటూ రాజు ముఖస్తుతి ప్రారంభించాడు...బొత్తిగా వ్యక్తిత్వం లేనిరాజు...నాకు విసుగుపుట్టి అక్కడినుంచి తప్పుకున్నాను...కాని ఆ ముఖస్తుతి వట్టిదికాదని నాకూ తెలుసు. రాఘవయ్య సమర్థుడు, ఉపాయశాలి, బలవంతుడు...కాబట్టే అతనంటే నాకు అసహ్యం, భయం.

రాఘవయ్యకు యిరవై ఏళ్ల అనుభవం వుంది—ఒక ఉపాధ్యాయత్వంలోనే కాదు; లౌక్యంలో, ముంగుకు నెగ్గుకొని పోవటంలో, పనులు నెరవేర్చుకోవటంలో... అతనే రాచకీయాల్లో ప్రవేశించివుంటే తప్పకుండా యీపాటికి మంత్రిగానో, మాజీ మంత్రిగానో వుండేవాడు. సందేహంలేదు!

రాఘవయ్య మా స్కూల్లో ఫస్ట్ అసిస్టెంటు—అంటే హెడ్‌మాష్టరు తర్వాత హెడ్‌మాష్టరు. హెడ్‌మాష్టరు గారికే రాఘవయ్యను చూస్తేభయం. రాఘవయ్య మాత్రం ఆయనతో చాలా 'స్వేచ్ఛ'గా చనువుగా వుంటాడు. ఉపాధ్యాయవర్గంలో చాలామందికి రాఘవయ్యమీద భక్తి; నాకూ, నాలాంటివాళ్ళొకరిద్దరికి మాత్రం అసహ్యం, కోపం; పైకి ఒప్పుకోకపోయినా లోపల తగనిభయం, ఎక్కడ మా కొంపలు తగుల బెట్టేస్తాడోనని! మిగతావాళ్ల పట్ల రాఘవయ్య ఎలా వున్నా, మా ఒకరిద్దరితో ముఖ్యంగా స్నేహపూర్వకంగా వుండాలని తన ఉద్దేశమైనట్లు ప్రవర్తిస్తాడు. తను ఏ కార్యంచేసినా, అందరిపొగడ్తలూ ఒకవైపు అలావుండగానే, ముఖ్యంగా మా అభిప్రాయాలకోసం తాపత్రయ పడటం మేము గమనిస్తూనేవుంటాము. అతనంటే మాకు పెద్దగా సద్భావంలేదనీ, గౌరవంలేదనీ ఎక్కడో అతని మనస్సులో ఒక చిన్నఅనుమానం వుండివుండాలి; అందరినీ గెలిచిన తను మమ్మల్నీ గెలిస్తే ఎంతబావుంటుందనీ, అందర్నీ గెలవటం ఒక ఎత్తు సులువుగా లొంగక తప్పించుకొనే మమ్మల్ని గెలవటం ఇంకొకఎత్తు అనీ, ఏదో తెలిసీ తెలీని ఉద్రేకం బహుశా అతన్ని ప్రేరేపిస్తూవుండాలి. కాని అతని ప్రయత్నాలుమాత్రం సర్వథా వృథా అవుతూనే వచ్చాయి. అందుకు చాల కారణాలున్నాయి:

రాఘవయ్య గణితంలో బి. ఏ., బి. యిడి.; అదే అతను బోధించేవిషయంకూడా. కాని ఏడెనిమిదేళ్ల క్రితం అతను ప్రయివేటుగా తెలుగులో ఎం. ఏ. ప్యాసయ్యాడు. అప్పటినుంచీ తనకు తెలుగుమీద సర్వాధికారం (ఎవరూ యివ్వకుండానే) వచ్చిందని అతని భావన. అంతేకాదు, తెలుగులో కవిత్వం, ముఖ్యంగా నాటకాలు, వ్రాయగలశక్తి తనలో కుసుమించి, వికసిస్తూవుందనీ, ఆ పరిమళంతో తెలుగు జగత్తుని పులిమి పునీతం చెయ్యటం తన విధ్యుక్తధర్మమనీ అతని గాఢ విశ్వాసం...దాని తాలూకు ప్రభావం నామీదే ప్రసరిస్తూ వుంటుంది తరచు!

నాలుగేళ్ళయింది నేను తెలుగు బోధించటానికి నియమించబడి; తెలుగులో ట్యూషన్ చెప్పమని ఎవరూ నాదగ్గరకు రారు. సాధారణంగా తెలుగులో పరీక్ష తప్పేవాళ్లు చాలతక్కువ; తప్పినా ట్యూషన్ కావాలనుకునేవాళ్లు మరీ అరుదుగావుంటారు. అలాంటిది నా అదృష్టం (!) నేను వచ్చిన రెండవ ఏడాది, నలుగురు స్కూలుఫైనలు తప్పిన విద్యార్థులు, ట్యూషన్‌కోసంవచ్చారు. వచ్చారోలేదో పదిరోజులు తిరక్కుండానే వెళ్లిపోయారుకూడా...అంటే రాఘవయ్యదగ్గర తెలుగు, లెక్కలుకూడా నేర్చుకోవటానికి వెళ్లిపోయారు! వెళ్లి తేవెళ్ళారు, అందులో అన్యాయం ఏమీలేదు అనుకోవలి...కాని వాళ్లు పరీక్ష నెగ్గటం మాత్రం తెలుగు నేర్చుకునికాదు ... రాఘవయ్యని

“చైత్రయాత్ర” పంపి, మార్కులు వేయించుకొని, కష్టంలేని సులభమార్గంలో ‘ఉత్తీర్ణు’లయ్యారు !

రాఘవయ్య శక్తిసామర్థ్యాలు ఏమిటో నాకీ విధంగా అనుభవమైన తర్వాత నేనా మనిషిని ఎలా గౌరవించగలను ? అతనంటే ఎలా భయపడకుండా వుండగలను?

రాఘవయ్య నన్ను చూడగానే చిరునవ్వు నవ్వుతాడు—“ఏమండీ శాస్త్రిల్లూ!...ఈ నాటకం కాస్త దిద్దిపెట్టవయ్యా ! ఈసారి స్కూలు వార్షికోత్సవానికి వేయించక తప్పదని హెడ్‌మాస్టరుగారి ఆజ్ఞ ! అయినా మీ అందరి పనులు నాతలమీద రుద్దటం ఆయన కిష్టం ...ఏంచేసేది, మొహమోటం!... ‘ఇది నా పనికాదు, తెలుగుమేష్టరుది’ అని చెప్పలేక పోతున్నాను.” అంటాడు. ‘ఫరవాలేదు, మీ కంటేనా ?’ అని నా నోటిగుండా వినాలని ఎదురుచూస్తాడు; కాని లాభం లేదు ! ఇక ఆ నాటకం విషయంకూడా నేను దాన్ని నిజంగా దిద్దిపెట్టాలని అతని అభిప్రాయం కాదు. దాన్ని చదవమనీ, మెచ్చుకోమనీ, పొగడమనీ ఆదేశం ! అది గ్రహించే, కిక్కురుమనకుండా తీసుకుని, రెండు రోజులతర్వాత భద్రంగా తిరిగి యిచ్చివేస్తాను; ముక్తసరిగా ‘బాగుంది’ అంటాను. ఏమిటి బాగుందో తెలుసుకోవాలని, నానోటెముత్యాలు రాల్చాలని తాపత్రయ పడతాడు మానవుడు !

ఒకసారి డి. యి. వో. గారొస్తే వెరైటీషో ఏర్పాటుచేశాము. మా హిందీ టీచరుకి మాతృభాష తెలుగుమీద చెప్పరాని అభిమానం. ఒక హాస్యనాటిక వ్రాసి, ప్రదర్శనానికి తయారుచేశాడు. అది నిజంగా బాగుంటుందని మేమందరూ అనుకున్నాము; స్టూడెంట్సుకూడా సరదాపడ్డారు. డి. యి. వో. గారు తను ఎనిమిదింటికి సరిగ్గాలేచి వెళ్లిపోతామని ముందేచెప్పారు.. ఇక చూడండి...రాఘవయ్యవ్రాసిన సోద నాటకమే ఎనిమిదిదాకా సాగింది. హిందీ టీచరు నాటకానికి ఛాన్సురాలేదు. డి. యి. వో. ఆవులిస్తూ కునికిపాట్లుపడి (అంతపెందలాడే నిద్రా?) 7-50 కే వెళ్తామని లేచారు. రాఘవయ్య ఏంజేశాడు?... నాటకాన్ని అలానే మధ్యలో ఆపుచేయించి, డి. యి. వో. గార్ని స్టేజిమీదికి రమ్మని ఆయనతో రంగంమధ్యనుంచుని ఫ్లాష్ కెమెరాతో ఫోటో తీయించుకుని మళ్లీ పంపాడు ! ఇక డి. యి. వో. ను మెప్పించదలుచుకున్న హిందీ టీచరు దిక్కులేకుండాపోయాడు.

రాఘవయ్యకు ముందుకు నెగ్గుకొని పోవటంలో అమోఘమైన ప్రతిభవుంది. ఆ మధ్య యూనివర్సిటీ సెనేట్‌కి రిజిష్టర్డ్ గ్రాడ్యుయేట్సు నియోజకవర్గం నుంచీ పోటీచెయ్యాలని సర్వసన్నాహాలుచేశాడు. కాని దైవం అనుకూలించలేదు, వెంట్రుకవాసిలో తప్పిపోయింది ఆ యోగం...డిస్ట్రిక్టు బోర్డువారు—ఈయనకు యూనివర్సిటీతో ప్రమేయం లేదనే కారణంతోననుకుంటాను— అనుమతించలేదు. ఎటొచ్చీ మరి యీయన జిల్లాబోర్డు టీచరే కదా!

ఇప్పటికి ఏడాదినుంచీ రాఘవయ్యకు హెడ్‌మాష్టరుగా ప్రమోషన్ వస్తుందని అందరూ అనుకుంటున్నారు...అందులో ఆశ్చర్యం ఏమివుంటుంది? ఇంతకుపూర్వమే రాకపోవటమొక్కటే నిజంగా ఆశ్చర్యపడదగ్గ విషయమని అనుకున్నాను...

నాలుగైదురోజులుగా రాఘవయ్య కనిపించలేదు...బహుశా బోర్డు స్పెషల్ ఆఫీసర్ని, డి. యి. వో. గార్ని కలుసుకుని ఆర్డరు వేయించుకోడానికి వెళ్లివుంటాడని ఊహాగానంచేశాము. కాని, ఒక సినిమా నటుణ్ణి మా స్కూల్లో ప్రదర్శనకి ఆహ్వానించటానికి మద్రాసు వెళ్లాడని ఎవరో అన్నారు.

నిన్నటిరోజు మద్రాసునుంచి తిరిగివస్తాడని అందరూ ఎదురుచూశారు...రాలేదు...బహుశా ఆ సినిమానటుడు “రేపు ఒక్కరోజు మా ఆతిథ్యాన్ని స్వీకరించి వెళ్లండి రాఘవయ్యగారూ!” అన్నాడేమోలే, పాపం, ఎలా నిరాకరంచగలడు మానవుడు ! అనుకున్నాం.

ఇవాళ తెలిసింది...పిడుగులాంటి వార్త... రాఘవయ్యకు పక్షవాతం వచ్చింది, హాస్పిటల్లో చేర్చారు అని.

“నేను వెళ్లొచ్చానండి...మనిషి చాల దిగాలుపడిపోయాడు...సెలవుసంగతి చూడమని మీతో చెప్పమన్నాడండి” అన్నాడు రాజు హెడ్‌మాష్టరు గదిలో ప్రవేశించి...నేనక్కడేవున్నాను.

రాఘవయ్యకు పక్షవాతమా ! అనుకున్నాను.

“పాపం!... రెండునెలలుగా మనోవ్యాధితో సతమతమవుతున్నాడు... ‘ఎందుకయ్యా యింతబాధపడతావు, వచ్చేప్రమోషన్ ఎప్పుడో వచ్చితీరుతుంది, ఏమిటీవ్యథ?’ అంటే కూడా మనసుకు దార్ఢ్యం చిక్కింది కాదు!...మద్రాసుకు వెళ్తానని సెలవుపెట్టిన

వాడు వెళ్ళనేలేదు...ఈ నాలుగురోజులు యిల్లుకదల్లేదట...మనిషి ఇంతగా చెదిరిపోతాడని నేనెన్నడూ అనుకోలేదు"అని నిట్టూర్చారు హెడ్‌మాష్టరుగారు.

"ఏం జరిగిందండీ మేష్టారూ?" అన్నాను. రాఘవయ్యకు మనోవ్యాధి ఏమిటో నాకు బొత్తిగా అర్థంకాలేదు.

"ప్రమోషన్ వచ్చే ఆశ లేదని రెండునెలలప్పుడు తెలిసింది...మొన్న, అంటే నాలుగురోజులప్పుడు రాఘవయ్య జూనియర్ సుబ్బారావుకి ఆ వేకన్సీ యిచ్చారు...ఇక దాన్తో రాఘవయ్య గుమ్మందాటి బయటకు రాలేదు." నా సందేహాలు తీరలేదు. కాని హెడ్‌మాష్టరుగార్ని గ్రుచ్చి గ్రుచ్చి ప్రశ్నించే తాహతు లేదు నాకు.

"వెళ్ళిచూచిరావాలి; మనమంతా వెళ్ళి ధైర్యం చెబితేగాని లాభంలేదు...పాపం పిల్లలుగలవాడు!" అన్నారు హెడ్‌మాష్టరు.

రాఘవయ్యకు ప్రమోషన్ రాలేదా! తను ప్రయత్నించికూడా సాధించలేకపోయాడా! ఆశ్చర్యంగావుంది! ఒకచేత్తోచేస్తే ఇంకోచేత్తో అనుభవిస్తారంటారు...కాని, ఇలా అనిపించిందోలేదో, మళ్ళీ ఏమైనా పక్షవాతం రావటంమాత్రం చాలఘోరం—అనుకున్నాను. మనిషి ఎలాంటివాడైనా, అందుకు అతని పెళ్ళాంపిల్లలు శిక్షింపబడటం, అది ఊహింపరాని అన్యాయం కదా! రాఘవయ్యచాలమంది మనసు నొప్పించాడు; అయితే అన్యాయానికి, అవినీతికి ఎక్కడో ఒక అవధివుంది! ఇన్నాళ్ళకు ఆ శక్తిసామర్థ్యాలు బోర్లపడ్డాయన్నమాట!

ఆరునెలలక్రితం తెలుగు సంస్కృతి సంఘంవారు నిర్వహించిన వ్యాసరచనపోటీలో నాకు బహుమతి రావటం, రాఘవయ్య రహస్యంగా పంపిన రచనకు బహుమతి రాకపోవడం—అది రాఘవయ్య మొదటి భంగపాటు..."నాకు తీరికలేక ఏమీ వ్రాసిపంపలేకపోయాననుకో!...ఎలాగైనా మన స్కూలుకే ఆ గౌరవం దక్కింది నీ మూలంగా...కంగ్రాచులేషన్స్, శాస్త్రిల్లూ!" అన్నాడు రాఘవయ్య, తన మామూలు చిరునవ్వులో. బహుమతి తనకురావాలని రాఘయ్య తొక్కిన అడ్డదార్ల వివరాలన్నీ ఆ సంస్కృతిసంఘం తాలూకు మిత్రుడొకడు నాకు అప్పటికే తెలియజేశాడు. నిజం ఏమిటో ఎరిగున్న నాకు రాఘవయ్య బుకాయింపుమాటల ధోరణిలోని నటనకౌశలం ఆశ్చర్యాన్ని కలుగజేసింది. ఎలాంటి అపజయాన్నైనా, లోటుపాట్లనైనా క్రమ్ముకుని రాగలశక్తి రాఘవయ్యలో ఏదోవుందని ఆనాడు గట్టిగా నమ్మాను!

అలాంటివాడు—చెట్టంతమనిషి— ప్రమోషన్ రాకపోవటంతో... మనోవ్యథతో... కుప్పకూలిపోతాడా?

"ఆఁ...మనోవ్యథ ఏమిటోయ్...ఆ మనిషికి డయాబెటిస్ ఎన్నాళ్ళనుంచో వుంది...ఈ మధ్య న్యూరాల్జియాతో బాధపడుతున్నాడు... అందువల్ల వచ్చిందికాని, పక్షవాతానికి, ప్రమోషన్‌కి సంబంధమేమిటి?" అన్నాడు సందేహంగా నా మిత్రుడు... రాఘవయ్యని అసహ్యించుకునే వారిలో ఒకడు.

"ఏది కారణమైనా, ఆ కుటుంబం సంగతి ఆలోచిస్తే దారుణమనిపిస్తోందోయ్...మనం ఒకసారి హాస్పిటలుకు వెళ్ళిరావాలి. ఏమంటావ్?" అన్నాను.

"అలాగేలే...శత్రువైనా ఆపదలోవున్నప్పుడు పరామర్శించటం మానవధర్మం...ఇంతకూ రాఘవయ్యంటే మన కిష్టంలేదుగాని, అతను మనకు శత్రువేం కాదుగా!" అన్నాడు మిత్రుడు.

హాస్పిటలుకి వెళ్లాము.

తలగడలమధ్య, చలనం, చైతన్యం లేకుండా, మాసిన తెల్లటిగడ్డంతో నిస్సహాయుడుగా పడివున్న రాఘవయ్యనుచూస్తే జాలివేసింది... గుర్తుపట్టాడు, బావమరది మేము వచ్చామని దగ్గరగావంగి చెప్పిన తర్వాత.

ఇప్పుడు కొంత స్పృహగావుందనీ, టెంపరేచర్ తగ్గిందనీ అన్నారు...కాని విపరీతమైన తలపోటు వుందట. "అంతా మనోవ్యథ...ఏంచెయ్యను చెప్పండి" అన్నాడు రాఘవయ్య బావమరది. డాక్టరూ అదే అన్నాడట! "మీరు ధైర్యంగా, ప్రశాంతంగావుంటే కొంతవరకు మళ్లీ కోలుకునే అవకాశంవుంది!" అని. రాఘవయ్యకు దగ్గరగావంగి, మేమూ అదేమాటలు చెప్పాము.

"మీకేమిటండీ లోటు? మీకు జరిగిన అన్యాయాన్నిగురించి యిప్పుడాలోచించటం దేనికి? అందువల్ల మీకు మీరే మరీ అన్యాయం చేసుకుంటున్నారు. మనసు మరల్చుకోండి...మీరు ధైర్యంగా, ఉత్సాహంగావుంటే ఆరోగ్యం కుదురుతుంది, అన్నీ చక్క

బడుతాయి; ప్రమోషన్ మాత్రం రాక ఎక్కడికి పోతుంది?...ఇది మామూలు పక్షవాతంకాదు; మానసికమైన కారణాలవల్ల వచ్చిందంటున్నారు; భగవంతుడిమీద భారంవేసి ధైర్యంగావుంటేచాలు...ముందు ఆలోచించటం మానుకోండి!"

“అన్యాయం... చేశారు... లాభంలేదు...నా పని...” అయిపోయింది అన్నట్లు తల ఆడించబోయి విఫలుడయ్యాడు రాఘవయ్య. మాటలు అస్పష్టంగా వున్నాయి.

“మేం వెళ్తాం...మళ్ళీ కలుసుకుంటాం” అని చెప్పగానే “ఏమో...మా వాళ్ళని...చూడండి” అని కళ్ళనీళ్లు పెట్టుకున్నాడు.

ప్రమోషన్ రాకపోవటంతో ఏమంత నష్టం వచ్చిందని రాఘవయ్య యిలా కూలిపోయాడో మాకు అర్థంకాలేదు...ట్యూషన్ల మూలంగా, మార్కులు వేయించేమూలంగా, హెడ్‌మాష్టరుజీతంకంటె చాల ఎక్కువే గడిస్తున్నాడు. హెడ్‌మాష్టరు పదవి వస్తే యీ రెండువిధాల డబ్బు గడించటం బహుశా వీలు కాకపోవచ్చుకూడా. కాబట్టి ఆర్థిక దృష్ట్యా, ప్రమోషన్‌రాకపోవటంవల్ల, రాఘవయ్యకు నష్టమేమీలేదే!

మరి కారణమేమిటి?

యూనివర్శిటీ సెనేట్ ఎలెక్షన్లలో స్పెషల్ ఆఫీసరు బంధువొకాయనకి రాఘవయ్య ప్రత్యర్థి అవుతాడని అప్పుడు అనుమతి నిరాకరించారట; అందుమీద రాఘవయ్య ఆ వ్యక్తి ఓడిపోవటానికి బాగా కృషి చేశాడు. రాఘవయ్య యిలాచేశాడని స్పెషల్‌ఆఫీసరు, డి. యి. వో. కూడబలుక్కుని ప్రమోషన్ లేకుండా చేశారు. మార్కులువేయించే అలవాటుందనీ, ట్యూషన్లు చెబుతున్నాడనీ డి. యి. వో. వ్రాసిపెట్టాడట...కాని యిదంతా ఒకరిమీదొకరు ఎత్తుకుపైఎత్తు వేసే చదరంగం ఆటలాంటిది...ఎవరైనా సరే గెలుపు ఓటమి, రెండింటికీ సిద్ధంగావుండాలి... రాఘయ్య మాత్రం ప్రమోషన్ విషయంలో తనకుతగిలిన దెబ్బకు తాళుకోలేకపోయాడు! ఎందువల్ల?

‘పదవీ వ్యామోహం’ అటువంటిది అంటే...అది అంతగా చావుబ్రదుకులకు ముడిపెట్టుకున్న విషయమా! ...నాకు నమ్మకం కలగటంలేదు! రాఘవయ్య జీవితమంతా ఒక్క ‘హెడ్‌మాష్టరు గిరీ’ అనే లక్ష్యం చుట్టూనే తిరిగిందా యిన్నాళ్ళూ? పోనీ అలానే అనుకున్నా, ఆ లక్ష్యసాధనలో ఆటంకం కలిగినప్పుడు దాన్ని తొలగించటానికి అతను చెయ్యవలసిన ప్రయత్నం ఏదీ? అతని తెలివీ, శక్తిసామర్థ్యాలు ఏమైపోయినట్లు?

రాఘవయ్య సమర్థుడు, బలవంతుడు, నీతి—అవినీతి అనే భయం అతనికిలేదు, ముందుకు పోవటానికి ఎన్ని సందుదార్లు అడ్డదార్లువున్నాయో అవన్నీ తెలుసు, తనకు ఎదురువచ్చిన వాళ్లెవరైనాసరే వాళ్ళ అంతు చూడగలడు—ఇదీ అతన్నిగురించి మాలో స్థిరపడిన అభిప్రాయం...కాని రావఘయ్య ప్రస్తుత, పరిస్థితి అతను బలహీనుడు, పసిపిల్లవానికంటె బలహీనుడు, అని నిరూపణచేస్తోందే.

అవినీతి, అడ్డదార్లు అనేవి ‘బలా’నికికాదు, ‘బలహీనత’కే చిహ్నాలుకాబోలు! రాఘయ్యకు నిజంగా తెలుగులో పాండిత్యమూ, ప్రతిభా వుంటే, అతను మంచినాటకాలే వ్రాయగలిగితే, అతను విద్యార్థులకి బాగా చదువేచెప్పగలిగితే—తన బుకాయింపుతో, డిప్లొమసీతో, చిరునవ్వులో, నన్నూ, యితర్లని బాధపెట్టే అవసరమే వుండేదికాదు కాబోలు! అతనిలో నిజంగా లోపించింది సామర్థ్యమే! ఇక ఆత్మవిశ్వాసం మాత్రం ఎలావస్తుంది? అంతే అనుకోవాలి, లేకపోతే మనిషి యిలా కుప్పకూలిపోతాడా?

* * *

రాఘవయ్య పోయాడని తెలిసింది.

ఒక్కొకసారి మనం గమనిస్తూనే వుంటాము...పసిపిల్లలు పెద్దవాళ్లుగా నటించటం...బలప్రదర్శన చెయ్యటం...అలవిగాని పనుల్ని చెయ్యగలిగినట్లే ప్రయత్నించటం...చివరకు ఏ కుర్చీయో, బాయో, తగిలితే చప్పున చతికిలబడి, పెద్దగా ఏడుపు లంకించుకోవటం...అప్పుడు ఎవరైనావచ్చి ఎత్తుకొని లాలించి, ఆ పసివాడికి వాని పసితనాన్ని రుజువు చేస్తేగాని ఓదార్పు అంటూవుండదు...రాఘవయ్యలాంటి వాళ్ళ వ్యక్తిత్వంయొక్క పసితనానికి దెబ్బతగిలినప్పుడు ఓదార్పు ఒక్క భగవంతుడే ప్రసాదించగలడు!